ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

కదిరి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వైసిపిలో..

కొత్త ముఖాలు..!

- అధికార పార్టీలో భారీ మార్పులు
- ఔత్సాహికుల్లో ఉత్సాహం
- ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం పరుగులు

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుండటంతో కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి పెద్దఎత్తున మార్పులు చేర్పులు చేపట్టే ఆలోచనలో ఉందని తెలియడంతో ఔత్సాహికుల్లో ఉత్సహం నెలకొంది. ఏదో రకంగా అధిష్టానం దృష్టిలో పడేందుకు అనేక రకాల ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. సిట్టింగ్‌ల్లో మాత్రం ఎక్కడ లేని గుబులు రేగుతోంది. తమ స్థానం ఉంటుందా... గల్లంతవుతుందా అన్న సందిగ్ధం వారిలో కన్పిస్తోంది. ఏదో రకంగా తిరిగి తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు సిట్టింగ్‌లూ కసరత్తులు చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో నాలుగైదు మినహా తక్కిన అన్ని స్థానాల్లోనూ మార్పులు చేపట్టే సూచనలు వైసిపిలో కనిపిస్తున్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాల్లో నేతలు టిక్కెట్టు కోసం తిరుగుతున్న వారిలోనున్నారు. ఇందులో చూస్తే ఉమ్మడి జిల్లాలోని రెండు రిజర్వు స్థానాలు మడకశిర, శింగనమలల్లో మార్పులు చేపట్టే ఆలోచనలో వైసిపి అధిష్టానం చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. మడకశిర నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఈసారి లేకపోవడంతో కొత్తగా రెండు పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో ఒకరు డాక్టర్ దివాకర్ టిక్కెట్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న వారిలోనున్నారు. ప్రభుత్వ వైద్యులుగానున్న ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేయడానికి సిద్ధపడుతున్నారు. అదే సమయంలో సిఐగా పనిచేస్తున్న శుభకుమార్ కూడా పోటీలోనున్న వారిలోనున్నట్టు ప్రచారం నడుస్తోంది. మరికొంత మంది కూడా ఆశిస్తున్న వారిలోనున్నారు. ఇక శింగనమల ఎమ్మెల్యేగా జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు. ఈసారి ఈమెకు అవకాశం లేకపోవచ్చునని ప్రచారం నడుస్తోంది. ఈ స్థానంలో డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి పేరు వినిపిస్తోంది. ఇక మార్పులుండే నియోజకవర్గాల్లో పుట్టపర్తి నియోజకవర్గం కూడా ఉన్నట్టు సమాచారం. ఇక్కడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో దశాబ్ధాలుగా అనుబంధమున్న కృష్ణ సుమన్‌రెడ్డి (కిట్టూ) పేరు కూడా వినిస్తోంది. ఈయన కాకుండా మాజీ మంత్రి రవీంద్రారెడ్డి కుమారుడు ఇంద్రజిత్‌రెడ్డి, ఎస్వీ సోమశేఖర్‌రెడ్డి కూడా ఉన్నారు. కదిరిలో సిద్ధారెడ్డి కాకుండా మక్బుల్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమించే అవకాశాలున్నట్టు పెద్దఎత్తున ప్రచారం నడుస్తోంది. ఇవి కాకుండా కళ్యాణదుర్గం, రాయదుర్గంలోనూ మార్పులు చేపట్టే ఆలోచనలున్నాయి. ఇక పోతే పార్లమెంటు రెండు స్థానాల్లోనూ మార్పులు తీసుకొచ్చే ఆలోచన వైసిపిలో నడుస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. హిందూపురం పార్లమెంటు సభ్యులుగానున్న గోరంట్ల మాధవ్‌కు ఈసారి అవకాశం ఉండకపోవచ్చు. దీంతో అదే సామాజికవర్గానికే టిక్కెట్టు ఇస్తారా లేదా మార్పులు చేస్తారా అన్నది చర్చ నడుస్తోంది. అదే సామాజికవర్గానికి చెందిన చిత్రా వెంకటేశ్ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేసుకునే పనిలోనున్నారు. అనంతపురం పార్లమెంటుకు రంగయ్యకు కాకుండా ఆలూరు సాంబశివారెడ్డికి ఇస్తే ఎలాగుంటుందన్న ఆలోచన పార్టీ వర్గాల్లో నడుస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఆయన కూడా ఇంతవరకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. భార్య పద్మావతి ఎమ్మెల్యేగానున్నారు. ఈ ఎన్నికల్లో ఆమెకు అవకాశం లేనందున ఈయనకు పార్లమెంటు ఇస్తారన్న ప్రచారం నడుస్తోంది. ఏది ఏమైనా వైసిపిలో చాలా వరకు కొత్త ముఖాలు వచ్చే ఎన్నికల్లో కనిపించే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆగని ఆగ్రహం..!

- అంగన్‌వాడీల పొర్లుదండాలు..!
- జిల్లా వ్యాప్తంగా 7వ రోజు కొనసాగిన సమ్మె

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై అంగన్‌వాడీల ఆగ్రహం ఆగలేదు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఆందోళనను మొక్కవోను అకుంఠిత దీక్షతో జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. సోమవారం 7వ రోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. వీరి అందోళనకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు దీక్ష శిబిరాల వద్దకెళ్లి మద్దతు తెలుపుతున్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. నిరసనలో భాగంగా పుట్టపర్తిలో అంగన్‌వాడీలు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యాలయం ముందు పొర్లుదండాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ పాల్గొన్నారు. కదరిలోనూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పాల్గొన్నారు. ధర్మవరం ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ పాల్గొన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, రమేష్‌తో పాటు అంగన్‌వాడీలు ఈ కార్యక్రమంలో పాల్గొని వినతిపత్రం అందజేశారు. 'తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కావాలనే ప్రభుత్వం నాడ్చుడు ధోరణి అవలంభిస్తోంది. ప్రభుత్వ వైఖరి మార్చుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపం' అంటూ అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

జిల్లాలో కొనసాగుతున్న సమ్మె వార్తలు 6లో

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

కనీస వేతనాలు ఇవ్వలేరా.?

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్
- కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం సూచించిన మేరకు వారి పరిధిలోని అన్ని పనులనూ ఉపాధి ఫీల్డ్‌చేస్తున్నా వారికి కనీస వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీసవేతనం రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో పుట్టపర్తిలో నిరసన చేపట్టారు. జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పట్టణంలోని గణేష్ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం, వారికి అనుకూలమైన వారిని నియమించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా కూడా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బంది లేకుండా వారిని కొనసాగించే విధంగా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పట్టణాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయడం లేదన్నారు. కనీసం 200 రోజులు కూలీలకు పని కల్పిస్తూ 600 రూపాయలు కూలి ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలుకాలేన్నారు. అర్హత అనుభవం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ల యూనియన్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని డిఆర్‌ఒ కొండయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, మున్సిపల్ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బ్యాళ్ల అంజి, పెడపల్లి బాబావలి, ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు బాబుల్ రెడ్డి, సురేష్ బాబు, మాధవ రెడ్డి, శివారెడ్డి, చంద్రమోహన్, వేమాద్రి పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రగతి, గ్లోబల్‌జెన్ విద్యార్థులు

కరాటే పోటీల్లో ప్రగతి, గ్లోబల్‌జెన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల విద్యార్థులు ఈ నెల 17వ తేదీ బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటారు. ప్రగతి పాఠశాలకు చెందిన తన్మయి, సాయిశృతి, గ్లోబల్ జెన్ పాఠశాలకు చెందిన హన్వేష్‌రాయుడు, రాఘవ ప్రతీక్, శ్రీవైష్ణవి పతకాలు సాధించారని కరస్పాం డెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అన్ని రంగాల్లో ఆసక్తి చూపాలన్నారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన మాస్టర్లు, తల్లిదండ్రులను ఆయన ప్రశంసించారు.

మిస్టర్ ఇండియాలో 'పురం' వాసికి ప్రథమ స్థానం

హిందూపురం : రాజస్థాన్‌లో లోని జైపూర్‌లో ఆదివారం వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ వారు నిర్వహించిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ కాంపిటేషన్‌లో హిందూపురం పట్టణానికి చెందిన గోల్డెన్ జిమ్ నిర్వహకులు ఆరిఫ్‌వుల్లా 85 కిలోల క్యాటగిరిలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆరిఫ్‌వుల్లా మాట్లాడుతు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 450 మంది హాజరుకాగా అందులో తనకు ప్రథమ స్థానం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆరిఫ్‌వుల్లాను అభినందించారు.

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ క్రింద చికిత్సలు చేయించుకోవడానికి ప్రభుత్వం రూ. 25 లక్షల దాకా వ్యయం పెంచిందని త్వరలో అర్హులందరికీ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్ పి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డిఎంహెఒ ఎస్‌వి. క్రిష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ తిపేంద్ర నాయక్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ క్రింద ఉచితంగా వైద్యం పొందడం ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలపై ఎఎన్ఎంలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందే విధానంపై రూపొందించిన ప్రత్యేక యాప్ తో పాటు కుటుంబంలో కనీసం ఒక వ్యక్తి దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జనవరిలో ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో 5.33 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు అంది స్తామన్నారు. వీటిని ఆయా ప్రాంతాలలో సంబంధిత ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆయా కుటుంబాలకు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం పలువురికి స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను కలెక్టర్, ఎస్పీ మాధవరెడ్డి పంపిణీ చేశారు. అలాగే కదిరి ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన డాక్టర్ హరికృష్ణ ప్రజలకు అందించిన వైద్య సేవలను అభినందిస్తూ సేవా ఆరోగ్య మిత్ర ప్రశంస పత్రాన్ని అందించి రూ.5వేల నగదును జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్ర మంలో మహిళా నాయకురాలు హిందూపురం ఇన్‌ఛార్జి దీపిక రెడ్డి, డిపిఎం డాక్టర్ కుల్లాయప్ప నాయక్ పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల పంపిణీ వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో గ్రామ రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇంటి పట్టాను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం డిసెంబర్ 21వ తేదీ నాడు పేదలకు ఇళ్ల పట్టాలను అందజేస్తామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎస్పీ కార్యాలయానికి స్పందనలో వచ్చు ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు ఎస్పీ ఎన్ విష్ణు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో 'స్పందన' కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, స్పందన ఎస్ఐలు వెంకటేశులు, శ్రీరాములు సిబ్బంది పాల్గొన్నారు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

నల్లచెరువు : సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 4నెలల నుండి జీతాలు చెల్లించలేదని వారు వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి వేతనం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

బిల్లే ముత్యాలును అభినందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా బిల్లే ముత్యాలు

కనగానపల్లి : కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్‌గా బిల్లే ముత్యాలును నియమించినట్లు సోమవారం రాప్తాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే శంకర్ ప్రకటించారు. బిల్లే ముత్యాలు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మూడోసారి మండల కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికకు సహకరించిన హిందూపురం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కెటి.శ్రీధర్, శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'శల్య చికిత్సాలయం'లో అన్నదానం

మడకశిర : ధనుర్మాసం సందర్భంగా ఉపాధ్యాయులు రామకృష్ణ, అమల దంపతులు సోమవారం స్థానిక శ్రీసత్యసాయి శల్య చికిత్సాలయంలో రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్నదానం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాషానాయక్, అంజనప్ప, సరిత, గౌడ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత మృతికి సంతాపం

కనగానపల్లి : మండల పరిధిలోని భానుకోట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులుయాదవ్ ఆదివారం రాత్రి హఠాన్మరణం చెందారు. దీంతో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సోమవారం భానుకోట వెళ్లి నరసింహులు మృతదేహంపై టిడిపి జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, టిడిపి, పరిటాల కుటుంబం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన గొల్ల రామన్న ఇంటికెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అధికారులకు సన్మానం

మడకశిర : రొళ్ల మండలం జీడిగేపల్లి గ్రామస్తులు ఎంపిడిఒ ఆజాద్, ఇఒఆర్‌డి క్రిష్టప్పలను ఘనంగా సన్మానించారు. అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా సోమవారం అధికారులు మల్లిన మడుగు పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈక్రమంలో జీడిగేపల్లికి వచ్చిన అధికారు లను గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సన్నమారేగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గౌడ్, మాజీ ఎంపిటిసి రాజన్న, రవికుమార్, బండి రంగప్ప, బండి రమేష్, అర్చకులు మారన్న, మురుపన్న పాల్గొన్నారు.



ఎంపిడిఒ, ఇఒఆర్‌డిలను సన్మానిస్తున్న గ్రామస్తులు

'వై ఎపి నీడ్స్ జగన్'కు విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని 28 వ వార్డులో కౌన్సిలర్ సరితాల ఆశాబి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఆమె కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ జయరాంరెడ్డిలకు ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడు తూ గత ప్రభుత్వాల హయాంలో కాలనీల్లో సరైన వసతులు, రహదారి, నీరు, విద్యుత్, రైల్వే వంతెన కింద నీరు నిలిచి, కాలనీలకు రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కాలనీవాసులకు నూతన పెన్షన్లు, పాఠశాల చుట్టూ ప్రహరీ, రహదారులు, నీరు, విద్యుత్ లైట్లు, కేతిరెడ్డి కాలనీ నుండి ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ కాలనీలకు వెళ్లే రైల్వే వంతెన వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా మోటార్లతో బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రూ. 25 లక్షలలు వెచ్చించి కేతిరెడ్డి కాలనీ పార్కులో ఆంజనేయ స్వామి, కుళ్లాయి స్వామి దేవాలయాలు, కేతిరెడ్డి కాలనీకి కాల్వ వసతులు, తదితర సౌకర్యాలు కల్పించి కాలనీని అభివృద్ధి చేశారన్నారు. అంతకుముందు కేతిరెడ్డి కాలనీ ఆర్చి నుంచి సభా ప్రాగణం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, గోరకాటి పురుషోత్తంరెడ్డి, చింతా ఎల్లయ్య, వార్డు ఇన్‌ఛార్జి సరితల బాషా, కో ఆప్షన్ మెంబర్ కరీం, నాయకులు ఎస్పీ బాషా, వంట రమేష్, జింకా కంబగిరి, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, కత్తె పెద్దన్న, సుబాన్, గోపన సూరి, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్, అశోక్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో జరిగిన వైఎపీ నీడ్స్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న హనుమంతు, తదితరులు

ఎస్పీ మాధవరెడ్డికి డిహెచ్‌పిఎస్ సత్కారం

ప్రజాశక్తి-మడకశిర

జిల్లా ఎస్పీ ఎస్‌వి.మాధవరెడ్డి ప్రతిష్టాత్మక డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డ్ అందుకున్న సంద ర్భంగా సోమవారం పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు, మిత్ర బృందం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలబొకే ఇచ్చి జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం హనుమంతు మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ మాధవరెడ్డి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎల్లవేళలా కృషి చేశారని కొనియాడారు. మట్కా, గుట్కా, పేకాట, జూదం, బెట్టింగ్, ఇసుక మాఫియా, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని కోరారు. నేటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేని గ్రామాలు చాలా ఉన్నాయని, కులవివక్ష రాజ్యమేలుతోందనీ వీటి నిర్మూలనకు పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని సత్కరించిన వారిలో నాయకులు మల్లికార్జున్, శేఖర్, మంజునాథ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం: మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కీర్తనను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

యోగా సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ ఛైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని సాంస్కృ తిక మండలిలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజర య్యారు. యోగా అసోసియేషన్ నిర్వాహ కులు మాట్లాడుతూ గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ లో ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో కనగానపల్లి కెజిబివి, ఎపి మోడల్ స్కూల్, ముదిగుబ్బ మండలం నుంచి ముగ్గురు పిల్లలు పాల్గొన్నారని, వారిలో రాష్ట్రస్థాయిలో కీర్తన తృతీయ బహుమతి సాధించిందన్నారు. అలాగే ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథులు మాట్లా డుతూ పిల్లలకు చదువుతో పాటు శరీరం, మనసుకు యోగా ఎంతో అవసరమ న్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, ఫ్రమ్ జర్మనీ వెల్గా శాంతి, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్‌రెడ్డి, అనంతపురం జిల్లా యోగా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి విజేత విద్యార్థు లకు మెమెంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ధర్మవరం యోగా అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదానానికి రూ. 50వేల విరాళం

మడకశిర : ఈ నెల 24వ తేదీ పట్టణంలో నిర్వహించనున్న అయ్యప్పస్వామి మండల పూజ సందర్భంగా సోమవారం ఇండియన్ గ్యాస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పూజారి సుధీర్ నిర్వాహకులకు రూ. 50వేలు విరాళం అందజేశారు. ఈ సొమ్మును అన్నదానం కోసం మడకశిర అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

స్పందించే వరకు...సమ్మెను ఆపం...

తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మెను ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీలు తెగేసి చెప్పారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఏడవ రోజుకు చేరుకుంది. ఏడవరోజు సమ్మెలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్డీవో కార్యాలయాల ముందు అంగన్వాడీలు ఆందోళన చేశారు. కదిరి ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, ధర్మవరంలో జరిగిన సమ్మెలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, పెనుకొండలో నిర్వహించిన సమ్మెలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పి శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అంగన్వాడీల ఆందోళనకు టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు.

ధర్మవరంలో నిర్వహించిన సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రజలకు పేద పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్వాడి కేంద్రాల తలుపులను బద్దలు కొట్టి పోలీసులను అడ్డుపెట్టుకొని రాక్షసత్వ పాలన కొనసాగుతున్న జగనన్న పాలనకు 90 రోజులు చరమగీతం పాడుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు అన్నారు. అంగన్వాడీల సమ్మెలో ఏడవ రోజు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో సిఐటియు నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు ఓబులు, జిఎల్ నరసింహులు, బాబ్జాన్, జగన్మోహన్ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మాబున్నీసా తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని ఆర్డీవో వంశీకృష్ణకు అందజేశారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీలు వారం రోజులుగా తమ సమస్యలుపరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తుంటే సిఎం జగన్‌కు పట్టదా అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోని అంగన్వాడీలు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేశారు. అనంతరం ఆర్డీవో రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, శ్రామిక మహిళా ఉమ్మడి జిల్లా కన్వీనర్ దిల్షాద్, సిఐటియు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్ ఖాన్, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, రైతుసంఘం నాయకులు కొత్తపేట మారుతి, అంగన్వాడీ యూనియన్ ప్రధానకార్యదర్శి చంద్రకళ, అంగన్వాడీలు పోతక్క, దీనా, అరుణ, రత్నమ్మ, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని సిఐటియు నాయకులు విమర్శించారు. సోమవారం ఆరవ రోజు పుట్టపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. తొలుత గణేష్ కూడలి వద్ద నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు పొర్లుదండాలు పెట్టారు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు రంగమ్మ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, లక్ష్మణ్. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు నాయకులు బాబావలి, బాళ్ల అంజి పాల్గొన్నారు. వీరి ఆందోళనకు తెలుగుదేశం జనసేన నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కొంతమంది వైసిపి ప్రజాప్రతినిధులు అంగన్వాడీల గురించి మాట్లాడుతూ ఒళ్లు బలిసి రోడ్లు ఎక్కారని విమర్శించడం శోచనీయమన్నారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవటం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వైసిపికి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు గ్రామస్థాయి నాయకులు ఒక పథకం ప్రకారం గ్రామాలలో రెచ్చగొడుతూ అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణం చర్చలు జరిపి అంగన్వాడీ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేసి అంగన్వాడీలు అంటే ఏమిటో ప్రభుత్వానికి తెలిసి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ పవన్ హరి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నాగమణి, సుజాత, తెలుగుదేశం నాయకులు రత్నప్ప చౌదరి,, సర్పంచి శ్రీనివాసులు, జనసేన నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, అబ్దుల్, డాక్టర్ తిరుపతేంద్ర, రాము, పూల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా 7వ రోజైన సోమవారం అంగన్వాడీలు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తమ డిమాండ్లు నెరవేర్చేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జడ్పీ శీన, రమేష్, ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉష, జిల్లా కోశాధికారి శ్రీదేవి, వ్య.కా.సం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, సిపిఎం మండల కమిటీ సభ్యులు తిప్పన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి సంఘీభావం తెలిపారు. సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీక్షలో ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రివేణి, రాజేశ్వరి, ప్రాజెక్టు లీడర్లు బావమ్మ, జయమ్మ, సావిత్రమ్మ, మాబున్నీసా, జ్యోతి, లావణ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

పుట్టపర్తిలో నిర్వహించిన ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ . వెంకటేష్

పెనుకొండలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు

గ్రామ సచివాలయంలో 'స్పందన' కరువు

కోడూరు సచివాలయం 2 లో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

సాధారణంగా గ్రామ సచివాలయంలో ప్రభుత్వం నియమించిన సిబ్బంది ఎక్కువ శాతం ఫీల్డ్‌వర్క్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం మధ్నాహ్నం 3 లోపు పని ముగించుకొని స్పందనకు హాజరు కావాలని ఆదేశించింది. దీని కారణంగానే ప్రతి ఉద్యోగి కనీసం 3 గంటల నుండి 5 గంటల వరుకు ప్రతి రోజు స్పందన నిర్వహించి అందుబాటులో ఉంటూ హాజరు కావాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే క్షేత్రస్థాయిలో ఉద్యోగులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్నాహ్నం 3 గంటలు దాటితే సచివాలయంలో కనపడటం లేదు. సచివాలయంలో స్పందన ఉంటుందని భావించిన ప్రజలు వివిధ సమస్యలపై కార్యాలయయానికి వచ్చి ఉద్యోగులు లేక వెనుతిరుగుతున్నారు. ఇలాంటి పరిస్థితి కోడూరు సచివాలయం-2 లో సోమవారం చోటు చేసుకుంది. సోమవారం స్పందన సమయంలో కోడూరు-1, కోడూరు-2 సచివాలయాలను పరిశీలించగా కోడూరు-1 లో వెల్ఫేర్ అందుబాటులో ఉండగా, కోడూరు -2 లో ఎవ్వరూ లేరు. అయితే ఓ స్వీపర్ తలుపు ముందు కూర్చొని ఉంది. ఎందుకని ప్రశ్నిస్తే సాయంత్రం 5 గంటల తరువాత సచివాలయానికి తాళం వేయాలని చెప్పింది. దీనిపై ఎంపిడిఒ నరేష్ క్రిష్ణ ను వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు హిందూపురానికి ట్రైనింగ్‌కు వెళ్లారని చెప్పారు. మిగిలిన వారు అందరూ సచివాలయంలో తప్పని సరిగా మధ్నాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిందే అన్నారు. కాని సచివాలయంలో మిగిలిన విభాగాలలో సర్వేయర్లు పెనుకొండలో రీసర్వే లో ఉండగా, మిగిలిన జెఎల్ఎంలు, ఇంజనీరింగ్ అసిసెంట్లు, ఎఎన్ఎంలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వో, మహిళపోలీసులు సచివాలయంలో ఉండాలి. అయితే వీరిలో ముగ్గురు సెలవులో ఉన్నారని కార్యదర్శి నారాయణ స్వామి చెబుతున్నప్పటికీ స్పందన సమయంలో మిగిలిన ఏ ఒక్కరూ సచివాలయంలో లేరు. సచివాలయంలో ఉండే ఏ ఉద్యోగి అయిన మధ్నాహ్నం 3 గంటల వరకే ఫీల్డ్‌కు పరిమితం అవ్వాలి. ఆతర్వాత ఎన్ని పనులు ఉన్న ఖచ్చితంగా సచివాలయంలో ఉండాల్సిందేనని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. అలా ఉన్నట్లయితే క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు, వన్‌బి అడంగల్‌తో పాటు సర్వేకు సంబందించిన సమస్యలు, ఆరోగ్య సంబందిత సమస్యలు, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు చెప్పుకోవడానికి సంబంధిత అదికారులు అందుబాటులో ఉండాలి. కానీ వీరు ఎవ్వరు కూడా సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదు. ఎప్పటి లాగే ఇప్పుడు కూడా ఫీల్డ్‌లో ఉన్నామనే సమాధానాన్ని చెప్పుకొస్తున్నారు. మరి కొంతమంది 4 గంటల సమయంలో ఫోన్‌చేస్తే అంగన్వాడీల్లో ఉన్నామని చెప్పుకొచ్చారు. అయితే అంగన్వాడీ మూడుగంటలకే ముగుస్తుంది. ఏదో ఒక సాకుతో సచివాలయానికి రాకుండా కాలక్షేపం చేస్తూ విధులకు డుమ్మాకొడుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇలాంటి వారిపై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరి చర్యలు తీసుకుంటారా లేక ఎప్పటిలాగే కారణాలు చెప్పి వదిలేస్తారా వేచి చూడాలి.

నేరాలు ఘోరాలు

ఎలుగుబంట్ల దాడిలో మహిళకు గాయాలు

మడకశిర రూరల్ : మేకలు మేపేందుకు వెళ్లిన మహిళలపై ఎలుగుబంట్లు మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన సోమవారం మండల పరిధిలోని గోవిందాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నలుగురు మహిళలు కర్నాటక సరిహద్దులోని బిదరికెర చెరువు సమీపంలో మేకలు మేపేందుకు వెళ్లారు. సాయంత్రం వేళ మూడు ఎలుగుబంట్లు వారిని చుట్టుముట్టి మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ దాడిలో లక్ష్మినరసమ్మ తలపై వెంట్రుకలు మెత్తం లాగేయడంతో పాటు ముఖంపై గోళ్లతో దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఆమె కేకలు వేస్తూ కుప్పకూలింది. చుట్టు పక్కల పొలాల్లోని మహిళలు అక్కడికి చేరుకోనేలోగా ఎలుగుబంట్లు వెళ్లిపోయాయి. వాటి దాడిలో మరో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న లక్ష్మినరసమ్మ

పోలీస్ స్టేషన్ తనిఖీ

నల్లచెరువు : స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి డిఎస్‌పి శ్రీలత సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పెండింగ్ కేసులు, మండలంలో నెలకొన్న శాంతి భద్రతలను గురించి ఎస్ఐను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు తాగుడుకు జూదానికి దూరంగా ఉండే విధంగా వారిని చైతన్య పరచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లింగన్న, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
O.S.NO:310/2020
Between:
వేమ శివమాల W/o వేమ ఇంద్రపతి D.No:1-1189-96-A2 N60 కాలనీ, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
...వాది
మరియు
ఎ.అక్కులమ్మ W/o వెంకటరమణప్ప ...ప్రతివాది
ప్రతివాదికి దావా నోటీసు
To
ఎ.అక్కులమ్మ W/o వెంకటరమణప్ప D.No:2-1, గౌరాపురం H/o అల్లాపల్లి, ఓ.డీ.చెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
అను మీ పైన వాది అయినటువంటి వేమ శివమాల, తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తమై దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం పై వారి కోర్టు నందు 21/12/2023 వ తేది వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేది మీరు స్వయంగా కాని వకీలు ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు పై వారి కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది: 21/12/2023
స్థలం:కదిరి
వి.ప్రసాద్ రెడ్డి, బి.ఎ., బి.ఎల్, అడ్వకేట్, కదిరి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాలకు ఆర్డినేటర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధించి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వేగవంతంగా పరిష్కరిస్తే జిల్లా కలెక్టరేట్ వరకు అర్జీదారులు రారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ క్రిష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, జిల్లా సర్వే ల్యాండ్స్ రికార్డు ఎడి రామకృష్ణ, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డిపిఒ విజయ్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్యకార్మికులకు ఇచ్చిన హామిలను నెరవేర్చక పోతే ఈ నెల 27 నుంచి సమ్మెకు సిద్ధం అవుతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్ హెచ్చరించారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, కమిషనర్ చాంబర్ ముందు ఆందోళన చేసి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతు నాడు పాదయాత్ర, ఎన్నికల సమయంలో పారిశుధ్య కార్మికులకు ఎన్నో హామీలను ఇచ్చారన్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27 నుంచి సమ్మెలోకి వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఆనంద్, గుర్నాథ్ మూర్తి, శంకర, కృష్ణమూర్తి, బాబయ్య, రామంజప్పతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి : భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని విజ్ఞాన భారతి పాఠశాలలో డ్రగ్స్, ఈవ్‌టీజింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి అభినందన

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఇటీవల డిజిపి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక డిజిపి డిస్క్ కమెండేషన్ అవార్డు అందుకోవడం పట్ల పలువురు పోలీస్ అధికారులు ఎస్పీని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ జెడ్ విజయకుమార్ , ఏవో సుజాత, ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి, సూపరింటెండెంట్ నాగరాజు, మురళి, మహబూబ్‌బీ, రవీంద్రారెడ్డి, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్ రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు రాజు ప్రదీప్ సింగ్, డిపిఒ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఇంధన పరిరక్షణ అందరి బాధ్యత

హిందూపురం : ఇంధన పరిరక్షణ అందరి బాధ్యత అని విద్యుత్ శాఖ డిఇఇ భూపతి పేర్కొన్నారు. జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో గృహ, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో ఇంధన పొదుపు చిట్కాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిలు, ఎఇలతో పాటు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని విద్యుత్ శాఖ ఎడి నరసింహారెడ్డి తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కొత్తపేటలో గల మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఎడి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటే భవిష్యత్తు తరాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. మేరీ వరకుమారి, విద్యుత్ శాఖ ఎఇలు నాగభూషణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాళాలను బద్దలు కొట్టే అధికారం ఎవరిచ్చారు : పల్లె

పుట్టపర్తి క్రైమ్ : ఎన్నికల ముందు అంగన్వాడీలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక జగన్ రెడ్డి మాట తప్పి, మడమ తిప్పి మోసం చేశాడని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తున్న అంగనవాడీలపై కక్షగట్టి ఉక్కు పాదం మోపడం జగన్ రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. అంగన్వాడీలకు టిడిపి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీలు డిమాండ్ చేయడం ప్రశ్నించడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా నాగభూషణ

కదిరి టౌన్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా కదిరి పట్టణానికి చెందిన మేదర నాగభూషణ నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు నాగభూషణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. డిసిసి వైస్ ప్రెసిడెంట్‌గా మేదర నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా షేక్ అమీర్, కార్యదర్శులుగా హైదర్ వలీ, అక్రమ్ బేగ్‌లకు ఈసందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి కెఎస్ షానవాజ్ ,బీసీ రాష్ట్ర సమన్వయకర్త నచ్చు బాలకృష్ణ యాదవ్, పట్టణ అధ్యక్షులు ఆశ్రప్, కదిరప్ప, మునికుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య

మెమోంటో అందిస్తున్న సుమంత్ రామమూర్తి, తదితరులు

నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాఠశాల ఫౌండర్స్ డే వేడుకల్లో ఎల్ఆర్‌జి విద్యాసంస్థల అధ్యక్షులు సుమంత్ మూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఎల్ఆర్‌జి విద్యాసంస్థలను స్థాపించినట్లు ఆ విద్యాసంస్థల అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త సుమంత్ మూర్తి అన్నారు. హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి విద్యా సంస్థల్లో సోమవారం ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్, ఎల్ఆర్‌జి విద్యాలయ, ఎల్ఆర్‌జి నాయుడు జూనియర్ కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో విద్యాసంస్థల అధ్యక్షులు సుమంత్ మూర్తి, డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామమూర్తి, సెక్రటరీ బాలసుందరం తదితరులు పాల్గొన్నారు. పబ్లిక్ స్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుమంత్ మూర్తి, డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామమూర్తి, డిఎల్‌డిఒ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతు నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాల పేరు తీసుకురావాలన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పాఠశాల సెక్రటరీ బాలసుందరం మాట్లాడుతు పాఠశాలలో ఎక్కడాలేని విధంగా విద్యార్థుల కోసం యోగా, వ్యాయామ, గేమ్స్, స్పోర్ట్స్‌తో పాటు ఎన్‌సిసి ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ప్రతిభా విద్యార్తులకు సర్టిఫికెట్లతో పాటు మెరిట్ స్కాలర్‌షిప్‌లను, వివిధ క్రీడల్లో రాణించిన వారికి మెమెంటో, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఎఒ సంజీవరెడ్డి, ఎహెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు విజయ్, హరినాథ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథులతో పాటు ముఖ్యవక్తగా దీప్తి పాఠశాల వ్యవస్థపాక అధ్యక్షులు అబ్రహం కుట్టి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన ఖరారు

చిలమత్తూరు : హిందూపురం నియోజకవర్గంలో రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విస్తృతంగా పర్యటించనున్నారు ఈనెల 22 నుంచి 26 వరకు ఐదు రోజులపాటు చిలమత్తూరు లేపాక్షి మండలాల్లో పర్యటించి నేతలను సమన్వయపర్చడం ప్రజలతో సమావేశాలు నిర్వహించడం వంటివి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సోమవారం మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు అశోక్ కుమార్, మంత్రి వ్యక్తిగత సహాయకుడు చంద్రహాస్ మండలంలో పర్యటించి అన్ని పంచాయతీ కేంద్రాలలో ముఖ్యమైన నేతలతో సమావేశమయ్యారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పంచాయితీ కేంద్రాలలో మంత్రి పర్యటించనున్నారని అక్కడే సభను ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచి మురళి, సంధ్య స్థానిక నాయకులు రామక్రిష్ణ రెడ్డి, సదాశివరెడ్డి, అమరప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థినులకు ప్రశ్నాపత్రాలను అందిస్తున్న ఉపాధ్యాయులు

మోడల్ ప్రశ్నాపత్రాలు అందజేత

ప్రజాశక్తి - కదిరి టౌన్

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో దాతలు సహకారంతో సోమవారం కదిరి రూరల్ మండలం కొండమనాయుని పాలెం, కదిరిబ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10తరగతి చదువుతున్న దాదాపు 40 మంది విద్యార్థులకు మోడల్ ప్రశ్నాపత్రాలను అందజేశారు. దాత అసిస్టెంట్ ఇంజనీర్ పెరుమల్ల వెంకటలక్ష్మి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శంకర్ బాబు, స్వరూప మాట్లాడుతూ మోడల్ టెస్ట్ పేపర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రాజ్, సిద్ధారెడ్డి, పద్మావతి, నాగమణి, సలీం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రశ్నాపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-బత్తలపల్లి

పదవ తరగతి విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారులు చాముండేశ్వరి, సుధాకర్ నాయక్ ఆవిష్కరించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఆర్‌సిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఈ మోడల్ ప్రశ్నపత్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అనిల్ కుమార్, రామ్మూర్తి, మహబూబ్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పులి వాహనంపై మణికంఠస్వామి

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

మండలంలోని ఎం.కొత్తపల్లిలో గల అయ్యప్పస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పులివాహనంపై శ్రీమణికంఠస్వామి దర్శనమిచ్చాడు. ఓడిచెరువు, వడ్డివారిపల్లి, ఎం.కొత్తపల్లి తదితర గ్రామాల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన సభ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం ఆర్టీసీ డిపో ఆదాయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారాలు అందించిన ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించడానికి సోమవారం స్థానిక డిపో గ్యారేజీలో ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. డిపో మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెస్ట్ ఈపీకే, బెస్ట్ కేఎంపిఎల్, ఆర్నింగ్స్ గుడ్ బెస్ట్ మెకానిక్ కు డిపో మేనేజర్ నగదు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశులు, గ్యారేజ్ ఇన్‌ఛార్జి సికిందర్, హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, అసోసియేషన్ నాయకులు, 35 మంది ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్త చెరువులోనిజిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఎజ్ బిట్స్ పోటీలు నిర్వహించగా జిల్లా స్థాయికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జయచంద్ర, ఉపాధ్యాయులు ఉమాదేవి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక పశువైద్యశాల పరిధిలోని రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి జాతి జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్య అధికారి బి చెన్నకేశవ నాయక్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు పశువులను బట్టి గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఒక్కో రైతుకు 20 కిలోలు చొప్పున 460 రూపాయలతో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. గడ్డివిత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డుతో స్థానిక పశు వైద్యాలయాలలో సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.

ప్రజాసంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సేవేనాయక్ అన్నారు. మండలకేంద్రంలోని నాలుగవ సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి , నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, భాస్కర్, సర్పంచులు లక్ష్మీదేవి చంద్రాయుడు, ప్రతాప్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భైరవప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతున్న గాండ్లపెంట మండలవాసులు

జనసేనలో పలువురు చేరిక

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు యువకులు, చామలగొంది మాజీ ఉప సర్పంచి రామ్మోహన్ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కదిరి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు చలపతి, గాండ్లపెంట, నల్లచెరువు, ఎన్పీకుంట మండల కన్వనర్లు రవీంద్ర నాయక్, రవికుమార్, చౌదరి, టౌన్ ప్రధానకార్యదర్శులు అంజిబాబు, ప్రతాప్, వంశీ, రాహుల్, శివయ్య, చంద్రమోహన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

'టిడిపి'వాళ్లని చెప్పడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మీ పార్టీవారినే తిరిగి పార్టీలోకి చేర్చుకోవడం సిగ్గుచేటని టీడీపీ నాయకులు వైసిపి నాయకులపై మండిపడ్డారు. పట్టణంలోని కొత్తపేటలో కొందరు టీడీపీ నుంచి వైసీపీలోకి చేరినట్లు వైసిపి నాయకులు ప్రచారం చేసుకోవటంపై టిడిపి నాయకులు స్పందించారు. ఈ మేరకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరులతో సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని 36, 37, 38, 39 వార్డులలో 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైసీపీలోకి చేర్చుకున్నట్లు వైసీపీ నాయకులు ప్రచారాలు చేసుకున్నారన్నారు. వైసీపీలో చేరిన వారిలో ఒక్కరైనా టీడీపీ సభ్యత్వం ఉన్నట్లు, టీడీపీ కార్యక్రమాలలో పాల్గొన్నట్లు నిరూపించగలరా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు నాగూర్ హుస్సేన్, అత్తార్ రహీంబాషా, మాదన సుబ్బయ్య, బిల్లేశన, రాయపాటిశివ, కేతాశీన, ఖాజాపీరా, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు బాధ్యతలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

వినియోగదారులు తమ హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకున్నప్పుడే సరైన న్యాయం జరుగుతుందని రాష్ట్ర వినియోగదారుల సమైక్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారి రామకృష్ణ అధ్యక్షతన జాతీయ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ లావాదేవీలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని తద్వారా మోసాలకు గురైతే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై ఏ విధంగా స్పందించాలి ఏ విధంగా ప్రమాదాలు ఎదుర్కోవాలి అన్నదానిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు ధర్మవరం నారాయణమ్మ, కదిరి రామిరెడ్డి, తాడిమర్రి వెంకటేష్, సంఘాల ప్రతినిధులు కుళ్లాయప్ప, రాధమ్మ, వెంకటలక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి : దీపిక

సమావేశంలో మాట్లాడుతున్న దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 11, 12వ వార్డు మోడల్ కాలనీలోనిసచివాలయాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇన్‌ఛార్జుల అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల లబ్ది బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, పట్టణ ఎ, బి బ్లాక్ కన్వీనర్లు సిపిసి సాదిక్, వాటర్ నరేష్, జెకెఎస్ కన్వీనర్ నౌషాద్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని సోమవారం నాడు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామానికి చెందిన కవిత(20) ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఇసిఇ గ్రూపులో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం భోజన విరామం తరువాత క్లాసుకు హాజరవలేదు. దీంతో సిబ్బంది హాస్టల్ గదిలో చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. సిబ్బంది అప్రమత్తమై కొన ఊపిరితో ఉన్న కవితను కిందకు దింపి అనంతపురం నగరంలోని సవేరా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకునే సరికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలియడంతో ఆసుపత్రి వద్దకు కవిత తల్లిదండ్రులు , బంధువులు చేరుకున్నారు. తాను బాగా చదివి చెల్లెలు, తమ్ముడిని బాగా చదివిస్తానని కవిత చెప్పేదని కవిత తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇలా ఎందుకు చేసుకుందో తెలియదని ఆవేదన వ్యక్తం చేసింది. చదువుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ లెటర్ దొరికినట్లు కొంత మంది చెబుతుండటం గమనార్హం. పోలీసులు మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. డీఎస్పీ శివారెడ్డి ఆసుపత్రి వద్ద పరిశీలించారు. విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.